అన్నదాత మెడపై నిబంధనల కత్తి

- నవాలక్ష ఆంక్షలతో అన్నదాత సుఖీభవకు సమాయత్తం
- వ్యవసాయ అధికారుల చేతికి వెబ్‌ల్యాండ్
- అందులో తప్పిదాలుంటే తోసిపుచ్చుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు


విత్తనాలు విత్తుతున్న రైతు

సీతారామపురం : కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమల్లో అన్నదాతకు గుండె కోతను మిగులుస్తోంది. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిబంధనల పేరుతో వారి మెడపై కత్తి వేలాడదీస్తోంది. పేర్ల తప్పిదాలకే అర్హత కోల్పోయేలా ఆంక్షలు అమలు చేస్తోంది.ఏడాదిగా ఊరించి పథకం అమల్లో నవాలక్ష సాకులను వెతుకుతూ రైతన్నలను మానసిక క్షోభకు గురిచేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ రైతుభరోసా అందించి అండగా నిలిచింది. అయితే కూటమి ప్రభుత్వం ఏడాదిగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా కాలయాపన చేసింది. ప్రస్తుతం నిబంధనల పేరుతో పథకానికి రైతన్నలను దూరం చేసేందుకు యత్నిస్తోంది. గత ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచి ఆర్థిక భరోసాను అందించి ధైర్యంగా పంటలను సాగు చేసే ధీమాను కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను చిన్నచూపు చూస్తూ ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. అన్నదాత సుఖీభవకు నిబంధనల పేరుతో షరతులు వర్తింపజేయనుండడంతో రైతులకు నష్టం కలిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరొకవైపు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తించే సూచనలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో వారికి అన్నదాత సుఖీభవ సాయం అందడం అనుమానంగా కనిపిస్తోంది.

పేర్లు తప్పులు ఉన్నాయని..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్‌ల్యాండ్ ఆధారంగానే ఐదేళ్లపాటు రైతు భరోసా పథకాన్ని అందించారు. ఏఒక్క రైతుకు ఇబ్బంది కలగలేదు. అందరి రైతుల్లో సంతోషం కనిపించేది. అధికారుల పరిశీలన, నివేదికలంటూ హడావుడి ఎక్కడా కనిపించేది కాదు. ఒక్కరైతు నుంచి కూడా పథకం అందలేదన్న ఫిర్యాదు లేకుండా కొనసాగించారు. కేంద్రం వాటా రూ.6,500, రాష్ట్రం వాటా రూ.7,500 కలిపి రూ.13,500 గత ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిబంధనల పేరుతో లబ్ధిదారులైన రైతుల జాబితాలో కోతలు విధించే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటి వరకు పేర్లు, ఆధార్‌లో తప్పులు ఉన్నాయని, చిన్న చిన్న పొరపాట్లు ఉన్నాయని వెబ్‌ల్యాండ్ నుంచి 46,869 మంది పేర్లను పరిశీలనకు పంపారు. వాటిని రైతులు రెవెన్యూ కార్యాలయాల్లో పరిష్కరించుకోవాలి. దీనిపై రైతులకు సరైన అవగాహన లేక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 3,97,731 మంది రైతులు ఉన్నారు. వారిలో వెబ్‌ల్యాండ్ పరిశీలన కోసం తహసీల్దార్ లాగిన్‌కు 46,869 మంది పేర్లను పంపారు. అందులో 4,342 మందిని ఓకే చేయగా, 20,419 మందిని తిరస్కరించారు. అలాగే మరో 22,108 మందిని పెండింగ్‌లో ఉంచారు. గత ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎగ్గొటింది. రైతుకు ఇస్తామన్న రూ.20వేలు అందజేసి ఉంటే జిల్లా రైతాంగానికి వందల కోట్ల మేర లబ్ధి చేకూరేది. దీనిని విస్మరించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కోతలు పెట్టేందుకు సిద్ధమైంది.

వెబ్‌ల్యాండ్ ఆధారంగా..

వ్యవసాయం చేస్తున్న రైతుల భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో చూసుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు లాగిన్ సౌకర్యం కల్పించింది. స్థానిక అధికారులు మొదట వెబ్‌ల్యాండ్‌లో రైతుల వివరాలను పరిశీలిస్తారు. అర్హులైన రైతులను గుర్తించి కిందిస్థాయి అధికారి పైస్థాయి అధికారికి పంపుతారు. అక్కడి నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్‌కు జాబితా చేరుతుంది. ఆ తర్వాత కమిషనర్ కార్యాలయంలో ఏ రైతుల పేరిట ఆదాయ పన్ను ఉంది, వారికి సంబంధించిన ఇతర ఆస్తుల వివరాలను తెలుసుకుంటారు. అర్హులు కాని రైతులను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. కమిషనర్ కార్యాలయం ఎంపిక చేసిన రైతుల జాబితాను మళ్లీ కిందిస్థాయి అధికారులకు పంపుతారు. వీరు పరిశీలించాక ఆ జాబితాలోని రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయనున్నారు. చివరగా పథకానికి అర్హత సాధించిన ప్రతిరైతు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలనే నిబంధన పెట్టారు. లేకుంటే రైతులకు ఆర్థిక సాయం అందదని అధికారులు చెబుతున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



అన్నదాత సుఖీభవకు సంబంధించి వెబ్‌ల్యాండ్ పరిశీలన జరుగుతోంది. రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలుసుకుని పరిష్కరించుకోవాలి. ముఖ్యంగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ అనుసంధానం చేసుకోవాలి.

–చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

కిలో పొగాకు సగటు ధర రూ.243

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 354 బేళ్లను వేలానికి తీసుకురాగా, 255 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 99 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.180, సరాసరిన రూ.243.71 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

డీసీపల్లిలో 564 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 564 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 784 బేళ్లు రాగా, 564 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.180, సరాసరిన రూ.240.13 ధర పలికిందని తెలిపారు.

నేడు నాగవరపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

సంగం: మండలంలోని కొరిమెర్లలో ఉన్న నాగవరపమ్మ, పోలేరమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వీసీ కొండయ్యనాయుడు సోమవారం తెలిపారు. కుంభాభిషేక మహోత్సవం జరిగిన నెల రోజులు పూర్తయిన సందర్భంగా ఉదయం 10 గంటలకు లలితా హోమం, 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు సామూహిక పొంగళ్లు, రాత్రి 8 గంటలకు సకల ద్రవ్యాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు హారతి పూర్ణచంద్ర దర్శనం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్లుప్తంగా

వెంగమాంబ హుండీ ఆదాయం రూ.12.10లక్షలు



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో హుండీ కానుకలను దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. మే 13 నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.12,10,630 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వీ ఉషశ్రీ తెలిపారు. నెల్లూరు హరిహరనాథ దేవస్థానం ఈఓ జానకమ్మ, నర్రవాడ ఏపీజీబీ బ్రాంచ్ సిబ్బంది, విశ్రాంత స్టేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ పాల్గొన్నారు.

వైభవంగా వ్యాళీ వాహనోత్సవం



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి వ్యాళీ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బినామీ మస్టర్లు వేస్తే చర్యలు



దుత్తలూరు: ఉపాధి హామీ పథకంలో బినామీ మస్టర్లు వేస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి హెచ్చరించారు. నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీలో అవకతవకలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన తిరివీధి శ్రీనివాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు నర్రవాడ సచివాలయంలో బహిరంగ విచారణను జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం నిర్వహించారు. ఫిర్యాదుదారు అందజేసిన వివరాలను ఆరాతీశారు. కొంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి మస్టర్లు వేస్తున్నారనే అంశాన్ని గుర్తించారు. పనికెళ్లని వారి పేర్లకు సైతం మస్టర్లు వేసి డబ్బులు కాజేస్తున్నారని గుర్తించారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడికి, ఫీల్డ్ అసిస్టెంట్ వర్గానికి తీవ్ర వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఇరువర్గాలకు పోలీసులు నచ్చజెప్పి శాంతింపజేశారు. ఏపీడీ మృదుల, ఏపీఓ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులు 99592 25645 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదులతో పాటు తమ విలువైన సలహాలు, సూచనలను అందజేయవచ్చని వివరించారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఆత్మకూరు: మండలంలోని మహిమలూరుకు చెందిన గుండుబోయిన నరసింహులుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ జీ గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీ సోమవారం తెలిపారు. బసవరాజుపాళెం గ్రామానికి చెందిన విజయ్ ఆటో, కారు అద్దెకు తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 27న విజయ్ మహిమలూరు చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా నరసింహులు అడ్డుకుని తమ గ్రామానికి రావద్దని, మరోసారి వస్తే మర్యాద ఉండదని, బూతులు తిడుతూ కులం పేరుతో దూషించాడు. ఆదేరోజు బాధితుడు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా పోలీసులు తనకు న్యాయం చేయలేదని ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితుడు జిల్లా ఎస్పీని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నరసింహులుపై ఆత్మకూరు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా ఉదయం పోలీసు స్టేషన్ ఎదుట బసవరాజుపాళేనికి చెందిన దళితులు, ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సభ్యులు నిరసన తెలిపారు.

సంగం పీహెచ్‌సీ తనిఖీ


సంగం: స్థానిక పీహెచ్‌సీని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం పెరమనలో 104 సేవలను పరిశీలించారు. ఇంటిన్సీ ఫైడ్ టీబీ ముక్త భారత్ కార్యక్రమంపై వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. టీబీ లక్షణాలు కలిగిన వారిని గుర్తించి గళ్ల పరీక్ష, ఛాతి ఎక్స్‌రే తీయించాలని వైద్యసిబ్బందికి సూచించారు. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గళ్ల పరీక్ష సంగం పీహెచ్‌సీలో అందుబాటులో ఉందని, ఐదు కేటగిరిల వ్యక్తులను పరిశీలించి పరీక్షలకు పంపాలని తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మర్రిపాడు: మండలంలోని రామానాయుడుపల్లిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని భారత వరి పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు పాల్గొని భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ నూతన వరి వంగడాలు, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మత్స్య శాస్త్రవేత్త హరి సాదు చెరువుల్లో చేపలు పెంపకంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ఎస్ రామమోహన్ పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామని, రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని పొందాలని రైతులకు సూచించారు. వీఏఏ మల్లిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సంగం: మండలంలోని దువ్వూరులోని గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి చిలక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రజక కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీమాధవి

దుత్తలూరు: పంటలకు సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జీ లక్ష్మీమాధవి తెలిపారు. మండలంలోని నందిపాడు సచివాలయంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు రసాయన ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా పురుగు మందులను వాడడం వల్ల పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పరిమితికి మించి పెరుగుతాయన్నారు. అలాంటి ఆహారం తీసుకోవడం ద్వారా మనుషులకు ఎక్కువగా కేన్సర్, జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. సేంద్రియ ఎరువులను, వేపనూనె, వేపపిండి, వేపగింజల కషాయాలను వినియోగించడం ద్వారా తెగుళ్ల ఉధృతిని నివారించవచ్చని వివరించారు.

సమాధులను ధ్వంసం చేయడం దారుణం


ధ్వంసం చేసిన సమాధులను చూపుతున్న బాధితులు

జలదంకి: రామవరప్పాడులోని హిందూ శ్మశాన వాటికలోని తమ తల్లిదండ్రుల సమాధులను కొందరు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని గ్రామానికి చెందిన బొడ్డు ఉదయ్‌కుమార్, శోభన్‌కుమార్, బోరా సౌజన్యకుమారి తెలిపారు. సోమవారం వారు శ్మశాన వాటిక వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలోని శ్మశానవాటికలో తమ తల్లిదండ్రుల సమాధులను నిర్మించుకుంటుండగా సర్పంచ్ భర్త ఉన్నం రవి అడ్డుతగిలి సమాధులను నిర్మిస్తే మీ అంతు చూస్తామని బెదిరించారని ఆరోపించారు. ఈ విషయమై తాము పోలీసులను ఆశ్రయించగా తమకు కావలి డీఎస్పీ అండగా నిలిచి సమాధులు నిర్మించుకోవాలని సూచించడంతో తల్లిదండ్రుల సమాధులను నిర్మించుకున్నామని తెలిపారు. అయితే ఈ నెల 6న అర్ధరాత్రి గ్రామానికి చెందిన శెట్టిపల్లి శ్రీనివాసులు, గుండాబత్తిన నితిన్, బొడ్డు సుధీర్, కాంతమ్మ, గళ్లా జానీ, ఏకోబు తమ పూర్వీకులు సమాధులను ధ్వంసం చేశారని వాపోయారు. డీఎస్పీ ఆదేశాలను ధిక్కరించి సమాధులను కూల్చిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సీతారామపురం : మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. సీతారామపురంలోని గౌతమి హైస్కూల్‌కు చెందిన కాడే ఓం ప్రవల్లిక, దాసరిపల్లి ప్రవీణ్, అయ్యవారిపల్లి హైస్కూల్‌కు చెందిన గురుమోహన్, బసినేనిపల్లి హైస్కూల్‌కు చెందిన తేజస్విని, జాస్మిన్ షైనింగ్ స్టార్స్ పేరిట ప్రభుత్వం ఏటా అందజేసే పురస్కారాలను అందుకున్నారు. సోమవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ కార్తీక్ రూ.20వేల నగదు చెక్కుతో పాటు మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

108లో ప్రసవం



కలిగిరి: మండలంలోని నరసారెడ్డిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మీదేవికి సోమవారం పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. లక్ష్మీదేవిని 108 సిబ్బంది ఆత్మకూరుకు తీసుకెళుతుండగా భట్టువారిపాళెం సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహన సిబ్బంది సురక్షితంగా కాన్పు చేసి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. దీంతో 108 సిబ్బందికి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం


విద్యుద్దీపాలంకరణలో అడవిపేరంటాలమ్మ ఆలయం


విశేషాలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలోని అడవి పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పూలతో విశేషంగా అలంకరించి కొట్టాలపల్లి, కొట్టాలపల్లి బీసీకాలనీ, గన్నేపల్లి, సర్వరాబాద్, తదితర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.కాగా జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వలసవాసులు బ్రహ్మోత్సవాలకు కుటుంబ సమేతంగా సొంతూర్లకు తరలిరావడంతో కోలాహలం నెలకొంది.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్యౌషధం

- కావలి ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి (జలదంకి)/అల్లూరు/దగదర్తి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషదమని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కావలి మున్సిపల్ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు యోగాంధ్రపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే దగదర్తిలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అలాగే అల్లూరులో కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ రజనికాంత్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం/వరికుంటపాడు/కలిగిరి/ఉదయగిరి : ఉదయగిరిలో ఎంపీడీఓ అప్పాజీ ఆధ్వర్యంలో పంచాయతీ బస్టాండ్ నుంచి రంగనాయకులస్వామి ఆలయం వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ జహీర్, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే కలిగిరిలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు, నాయకులు మానవహారం నిర్మించి యోగాపై అవగాహన కల్పించారు. అలాగే నాగసముద్రం పంచాయతీలో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానహారం చేపట్టారు. అలాగే వరికుంటపాడులో ఎంపీడీఓ నాగూర్‌వలి ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. సీహెచ్‌ఓ రాజశేఖర్, ఏపీఎం సుధాకర్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సీతారామపురంలో అధికారులు, నాయకులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వింజమూరులో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మకూరు/అనుమసముద్రంపేట/సోమశిల/సంగం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే సంగంలో ఎంపీడీఓ షాలెట్, ఇన్‌చార్జి తహసీల్దార్ సంధ్య ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్డీ వరప్రసాద్, వెలుగు ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ఎంఈఓ మల్లయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అనుమసముద్రంపేటలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే అనంతసాగరంలో అధికారులు, నాయకులు యోగాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏ రామచంద్రయ్య, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సంగంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఉదయగిరిలో..



అల్లూరులో..



కలిగిరిలో..


సోమశిల: అనంతసాగరంలో..


అనుమసముద్రంపేటలో..


వింజమూరులో..


వరికుంటపాడులో..


ఆత్మకూరులో..


సీతారామపురంలో..